యద్దనపూడి సులోచనారాణి

# వకుళ

వకుళ ఎక్కిన బస్సు వడ్లబస్తాలా కిక్కిరిసి వుంది!

కాస్త ఖాళీ వుండే బస్సు వస్తుందేమో, ముస్తాబు నలగకుండా కూర్చో వచ్చునని అరగంటనుంచి ఎదురు చూసినా—ఒక్క బస్సుకూడా ఖాళీగా రాలేదు. ప్రతిదీ పొట్ట పుబ్బినట్టుగా నిండే వున్నాయి! నేల యీనినట్టుగా ఎక్కడ చూసినా జనం! విపరీతమైన రష్! కాలుపెట్టే చోటు ఉండదు! బస్ స్టాప్‌లో, దేవాలయాలదగ్గర, రేషన్ షాప్స్‌వద్ద, యిక సినిమాహాల్స్‌దగ్గర చెప్పనే అవసరంలేదు. వరదలా, ప్రవాహం పొంగుతున్నటువంటి జనం!

వకుళ దిగాల్సిన స్టాప్ వచ్చింది! బస్సు ఆగింది. కండక్టర్ పెట్టిన కేక, జనంమధ్య కూరుకుపోయి, వాళ్ళగోలలో శ్రద్ధగా ఆలకించకపోతే వినిపించదు.

వకుళ లేనిసత్తువ తెచ్చుకుని, భుజాలతో పక్కవాళ్ళని నెట్టి, చేతులతో ముందువాళ్ళని తప్పించుకుని, దిగటానికి గుమ్మంవైపు వచ్చేసరికి, తలప్రాణం తోకకి వచ్చింది. అందంగా, వదులుగా పెట్టుకున్న పువ్వులు, ఒకావిడ పెద్ద చుట్టకి పట్టుకుని, దాన్ని వూడదీసేటట్టు భంగపరిచి, సాధ్యంకాక, తాము సగం తెగి క్రింద పడినాయి. ఒకతను తన మీద వచ్చి పడిన ఒకటి రెండు పువ్వులని పట్టుకుని గుప్పెటతో వాసనచూసి, వకుళవైపు శృంగార దృక్కులు విసిరాడు. ముడివూడిన ఆవిడ కళ్ళెర్రచేసి ముడి సరిచేసుకుంది. చి. ఛీ! వెధవ బస్సు! మరీ మధ్య తరగతి జీవితంలా ఒకటే యిరుకు! లోపలికి ఎక్కి స్థానం సంపాయించుకోవడం ఎంత కష్టమో, దిగాల్సిన స్టేజీ వచ్చినప్పుడు దిగటం కూడా అంత కష్టమే!

ఒకళ్ళు దిగాలని త్వరపడుతుంటే, గుమ్మందగ్గర పదిమంది లోపలికి రావాలని త్వరపడుతూ, తోసుకు వస్తుంటారు. వకుళకి ఆ దృశ్యం, ఒకరు చనిపోతుంటే, పదిమంది పుట్టుకు వచ్చే జనాభా లెఖ్ఖలు గుర్తుకు తెస్తుంది.

ఈ జన సముద్రపు కెరటాల తాకిడికి తట్టుకోవటం చాలా కష్టం! ఈ సందడి సమయంలో కొంతమంది కొంటె కుఱ్ఱకారు, ఆడవాళ్ల ఒంటిమీద అందిన చోట చెయివేసి, నొక్కి, తమ సరదా తీర్చుకుంటూ వుంటారు.

"కాస్త దిగనివ్వండి." దిగేవాళ్ళ బాధ.

"ముందు మమ్మల్ని లోపలకు రానీయండి." లోపలకి ఎక్కేవాళ్ల గోల. వీళ్లబాధ కండక్టర్‌కి పట్టదు. అతనికి బస్సు టైమ్‌కి వెళ్ళాలని తొందర ఒక్కటే! అతని ఉద్యోగం అది. అందుకే కోపంగా బెల్ తాడు ఝాడించి విడుస్తాడు.

ఆ బెల్ వింటే అందరికీ హడలు! బస్సు ఎక్కడ వెళ్ళిపోతుందోనని ఎక్కేవాళ్ల భయం! ఎక్కడ దిగలేమోనని దిగేవాళ్ల ఖంగారు! ఆతురత రెట్టింపు అవుతుంది! బలాబలాలు మరింత పెరుగుతాయి. ఫలితం, బస్సులో ఎక్కేవాళ్ళు ఎక్కలేరు. దిగే వాళ్ళు దిగలేరు. వకుళ కది జీవనపోరాటంగా అనిపిస్తుంది. ఎవరికి వారే తను బస్సు తప్పిపోతానేమో నని భయం!


కండక్టర్ తిట్టినట్టుగా అరిచాడు.

"ఆ అమ్మాయిని దిగనివ్వండి ముందు. మీరు తర్వాత లోపలికి రండి. అది శివుని ఆజ్ఞలాటిది. అందరూ భయభక్తులతో శిరసావహిస్తారు. తొందర చేసినవాళ్ళు తప్పుకున్నారు. దారి సుగమం అయింది! వకుళ పాదాలు ఎలాగయితేనేం, బస్సులోనుంచి, భూమి మీద ఆనాయి!

"అమ్మయ్య!" పెద్ద గొడవలోనుంచి బైటపడినంత ఆనందం! రోజులో 12 గంటలు, దేనికోదానికి చిరాకుపడే మనసు. యిలాటి అతి చిన్నవిషయానికి కూడా, అల్పసంతోషిలా అందలం ఎక్కినంత హాయిగా, సంబర పడుతుంది.

తోపిడి, వత్తిడి, పరుగులు, వురుకులు, ఎదురు దెబ్బలు, ఆశాభంగాలు, ఈ చక్రంలో చిక్కుకుని, గడిచిపోతూ వుంటుంది జీవితం. ఈ అలజడి క్రమంగా అలవాటయిపోతుంది. బాధలు తప్పించుకోలేకపోతే, వాటికి అలవాటు పడటమే మందు!

చి. ఛీ! యిస్త్రీ చీర, జాగ్రత్తగా, కుచ్చెళ్ళు అంచు అందంగా కనిపించేలా



కట్టుకున్నది నలిగిపోయింది. వీధిలో చీర సర్దుకోవటం బాగుండదు! వెనక నడుందగ్గర ఎత్తుగా వచ్చిందేమో! పువ్వులు తెగినాయి! ఆ మిగతా సగం లాగబోతే జడలో చిక్కుపడి రాకపోగా జుట్టు అసహ్యంగా పాయ విడివడింది. వకుళ పయిట భుజంమీదనుంచి జడ మీదుగా ముందుకు కప్పుకుంది! యిలా ముస్తాబు బలిగొంటుందనే కాస్త ఖాళీ వున్న బస్సుకోసం ఎదురుచూస్తే, అది రాకపోగా, మరింత వత్తిడివున్న బస్సు ఎక్కాల్సివచ్చింది.

వై మెంతయిందో! చెయి చూసుకున్న వకుళ గుండె ఝల్లుమంది! చేతికి వాచీ లేదు! ఆతురతగా, బస్సు దిగి నడిచివచ్చినంతమేరా వడి వడిగా, వెనక్కు వెళ్ళి చూసుకుంది. ఎక్కడా లేదు! తన పిచ్చిగానీ, గట్టిగా పీకితే గానీ రాని, ఆ స్ట్రాప్ ఎందుకు వూడుతుంది? ఎవరో కొట్టేసారు!

అంత రష్‌లో ఆ బస్సులో యీ పని జరిగిపోయివుంటుంది! అంత జనం! అన్ని జతల కళ్ళు ఎలా కప్పగలిగాడో! ఆ! ఆ! వాడే! కళ్లకి గంతలా యింత

పెద్ద కళ్లజోడు, **పువ్వుల** బుష్ షర్టు వేసుకున్నాడే! **వాడే!** దొంగ వెధవ! వాడిని చూస్తేనే అనుమానం వేసింది! వెధవ పోజూ వాడూను! ఎంత మంచి బట్టలు వేసుకున్నాడో! బస్సు మామూలుగా వెళ్తున్నా, కదిలిపోయినట్లుగా, మాటిమాటికీ, వెన్నుమీద పడి ఆనుకున్నాడు. ఘరాన దొంగ!

వకుళ అడుగుల వేగం హెచ్చింది!

ఇప్పుడు బంగారంలాంటి వాచీ పోయిందని దిగులుపడే వ్యవధి లేదు. బాధతో కృంగిపోతున్న మనసుని బలవంతంగా అదిమిపట్టింది. తను వెళుతున్నది ఇంటర్వ్యూకి! ఏడుపు ముఖం పెట్టుకుని వెళ్లకూడదు! కళ్లల్లో హుషారు వెలిగిపోతూ వుండాలి.

వకుళ మనసులో లేని వుత్సాహం అంతా తెచ్చుకుని, గబగబా ఆఫీసు ఆవరణలో అడుగు పెట్టింది.

వారం క్రితం యీ ఆవరణలో, యీ కంపెనీ ప్రకటించిన వుద్యోగం, అప్లికేషన్లకోసం ఎంత రగడ! ఎంత పెద్ద క్యూ! అప్లికేషన్లకోసం ఎంత మంది ఆశగా మండుటెండలో నిలబడ్డారు!

ఆ కంపెనీ ఎమ్. ఎస్‌సి. వాళ్ళు కావాలని ప్రకటించింది.

వకుళ సగర్వంగా వెళ్లింది! రెండు సంవత్సరాలనుంచీ చదువుమీద నిబంధనలు గట్టిగా విధించి, అమలుపరచటంతో, పరీక్షా ఫలితాలు చాలా నిరాశాజనకంగా వున్నాయి. ఏ యింట్లో చూసినా, తప్పి కూర్చున్న వాళ్లే ఎక్కువగా వున్నారు.అలాంటిది తను సెకెండ్ క్లాసులో పాసయింది. అందుకే వకుళ సగర్వంగా అప్లికేషన్‌కోసం వచ్చింది.

కానీ, వకుళ గర్వం ఎంతోసేపు నిలవలేదు. అప్లికేషన్‌కోసం ఆ ఆవరణలో అడుగుపెట్టగానే, అది అంతరించటమే గాకుండా, అక్కడున్న జనాన్ని చూసి కళ్ళు గిర్రున తిరిగినాయి.

కంపెనీవాళ్ళు ప్రకటించిన పది పోస్ట్‌లకి కొల్లేరు చాంతాడంత క్యూ వుంది! ఆ జనం బారు, అంతు తెలియని కొసలా వీధిలోకి వెళ్ళి, షాపుల పక్కనుంచి ఎక్కడికో మెలిక తిరిగి పోయింది! వకుళ వచ్చిన తర్వాత కూడా ఇంకా అనేకమంది వస్తూనే వున్నారు. ఆడపిల్లల క్యూలో తన ముందు నిల్చున్న కళ్లద్దాల అమ్మాయి ఎమ్.యస్‌సి. ఫస్ట్ క్లాస్‌ట! ఆమె ముందున్న తెల్లచీర యువతి గోల్డ్‌మెడలిస్ట్‌ట! తన వెనక నిలబడిన చారల చీరె అమ్మాయికి డబల్ డిగ్రీ వుంది. టైప్, షార్ట్‌హాండ్ కూడా వచ్చుట!

వకుళకి వాళ్లని చూస్తూంటే, తన వ్యక్తిత్వం ఏదో మంటకలిసిపోయినంత బాధ కలిగింది.

“వున్నవి పది పోస్ట్‌లే అయితే, యింతమందికి అప్లికేషన్లు ఎందుకు యిస్తున్నారో?” కళ్లజోడు అమ్మాయి అమాయకంగా అడిగింది.

“ఒక్కొక్క అప్లికేషన్ ఖరీదు అయిదు రూపాయలు. వాళ్ళు యివ్వబోయే వాళ్ల జీతాలు సంపాయించేయవచ్చు.” ఇంకో అమ్మాయి కసిగా అంది.

“అదేమంటే మెరిట్ అంటారు.” చారల చీర అమ్మాయి నిస్పృహపడింది.

“మన అదృష్టాన్ని లాటరీ వేస్తున్నారు అనుకుందాం.”

ఇలా రకరకాలుగా మాటలు వినిపిస్తున్నాయి.

తనకు తెలియని, తనకి అలివికాని, యీఅదృష్టం అనే సంగతి అంటే, వకుళకి చెప్పలేనంత విసుగు.

ఈ చిన్న చిన్న వాటికి కూడా అంత పెద్ద మాటలెందుకు? అనుకుంటుంది.

**ఆ రోజున** అంబితమందితో కిటకిటలాడిన యీ ఆవరణ యీ రోజున ఒంటరిగా, తన కోసమే ఎదురు చూస్తున్న దానిలా, ఆహ్వానిస్తుంటే, వకుళకి చాలా సంతోషం కలిగింది!

తన అదృష్టం! మొదటి వ్యక్తి తనే!

మొట్టమొదటే లోపలకు వెళితే, ఇంటర్వ్యూ చేసే అధికారులు కాస్త ప్రసన్నంగా మాట్లాడతారు. తర్వాత అయితే, రామ, రామ, విసుగు కలిగి సరిగ్గా మాట్లాడరు.

ఒక్క అతను మాత్రం అక్కడ బెంచీమీద కూర్చుని గోడకి తల ఆనించి నిద్రపోతున్నాడు.

అతని చేతిలో సర్టిఫికెట్లు వున్నాయి. ఇతను ఒక్కడు మాత్రం తనకంటే ముందు వచ్చాడు బహుశా ఏ తెల్లవారుఝామునో వచ్చి కూర్చునివుంటాడు!

వకుళ అక్కడున్న బెంచీమీద కూర్చోబోయింది.

ఇంతలో అటు వచ్చిన ప్యూన్ ‘ఏమిటమ్మా?’ అని అడిగాడు.

“ఇంటర్వ్యూకి వచ్చాను.”

“మీరు చాలా ఆలస్యంగా వచ్చారమ్మా. ఇంటర్వ్యూలు అయిపోయినాయి. వుద్యోగాలకి తీసుకున్న వాళ్ళు వాళ్ల సీట్లో కూర్చున్నారు కూడా. వెళ్లి రండి.” అన్నాడు.

వకుళ ముఖానికి వడగాడ్పు తగిలినట్టయింది.

“నిజమా!”

“కాకపోతే మీతో అబద్ధం చెబుతామా? అడుగో! ఈయన కూడా ఆలస్యంగా వచ్చాడు. చాలా దూరంనుంచి వచ్చాడట! తిరిగి వెళ్లే ఓపిక లేదంటూ నిద్రపోతున్నాడు.” అంటూ పక్క అతన్ని చూపించాడు.

వకుళ అయోమయంగా చూస్తోంది!

ఇంటర్వ్యూ అయిపోయిందా! వుద్యోగాలు యిచ్చేసారా?

ఖాళీగా వున్న ఆ ఆవరణ తనకి

స్వాగతం పలుకుతోందా? లేదు, లేదు. అది మహా శూన్యంగా మారి వెక్కిరిస్తోంది. ఆశలు రెక్కలు తెగి క్రింద పడినాయి! ఆ బాధ భరించలేని మనసు రోదిస్తోంది! పైకి ఏడవకూడదు!

అది సభ్యత కాదు! కన్నీళ్లని ఆపుకోవాలి! అంతక్రితం వాచీ పోయిందనే బాధ, యీ ఆశాభంగం రెండూ రెట్టింపు బలంతో విజృంభించి మనసుని దారుణంగా చీల్చసాగినాయి!


వకుళ వుస్సురంటూ వెనక్కి తిరిగింది! ఇంటినుంచి బైలుదేరగానే, దొరికిన బస్సు ఎక్కినట్టయితే బాగుండేది. అందులో రద్దీగా వుందని, కూర్చునే చోటు లేదని వెనక్కి తగ్గింది. మూడు వెంట, వెంట, అలాటివే వెళ్లిపోయినాయి. చివరకి ఒకటి ఎక్కింది. కానీ అది మధ్యలోనే ఆగిపోవటంతో, వెనక వచ్చిన బస్సులో యీ జనాన్ని అంతటినీ కుక్కారు. ఒక గంట లేట్! ఒక జీవితకాలం వేస్ట్! అన్నాడో ప్రజాకవి. ఏం చెయ్యటం! వకుళ నీరసంగా గేటువైపు వస్తోంది!

మనం కోరుకున్న ఆశల తలుపులు ఎప్పుడూ మూసే వుంటాయి! వాటిని అదృష్టం తెరవదు. తెరిపించుకునే యుక్తి-శక్తులు మనకి వుండవు!

వకుళకి ఎదురుగా, ఒక అతను గబగబా వస్తున్నాడు! అతన్ని చూడగానే, జాలేసింది! నవ్వు వచ్చింది! అతను బాగా తెలిసిన వ్యక్తే! ఆ తెలియటం అంటే, ఇద్దరిదీ ఏ కాలేజీ పరిచయమో కాదు. బంధుత్వం అసలే లేదు! అతని స్నేహితుడికి తను చెల్లెలు కావటమో, తన స్నేహితురాలికి అతను అన్న కావటమో అసలేకాదు!

వాళ్ళిద్దరిదీ పది ఇంటర్వ్యూల పరిచయం!

"ఇంటర్వ్యూకి వస్తున్నారా?" వకుళ అడిగింది.



సీరియస్‌గా, గబగబా ముందుకి వెళ్ళిపోబోతున్న అతను తిరిగి చూసాడు!

అతని కళ్లనిండా చెప్పలేనంత ఆశ్చర్యం నిండివుంది! దానికి కారణం లేకపోలేదు.

ఇదివరకు, అతను నాలుగైదుసార్లు పలకరించబోయి విదిలింపులు తిన్నాడు.

ఒకటి రెండు ఇంటర్వ్యూలకి యిద్దరూ వచ్చారు. రెండు మూడుసార్లు అలా కలిసేసరికి, ముఖ పరిచయం ఏర్పడింది! తర్వాత రెండు మూడుసార్లు కళ్లతోనే గుర్తింపు. ఆ తర్వాత, మూగగా పలకరింపు జరిగింది!

ఆ తర్వాత మరోసారి కలిసినప్పుడు, అతనే ధైర్యంచేసి పలకరించాడు! ఆ అమ్మాయి సమాధానం చెప్పకపోగా, కోపంగా ముఖం పక్కకు తిప్పుకుంది.

అతను చిన్నబోయిన మనసుని కళ్లలో కనబరచనీయకుండా, వెనక్కి వెళ్లి, తన స్థానంలో నిలబడ్డాడు.

ఆ మరుసటి నెలలో, ఆ రోజున వకుళ అభిమాన హీరో సినిమా విడుదల అయింది. అది చూడటానికి వెళ్లినపుడు, అక్కడ మగవాళ్ల క్యూలో అతనుకూడా నిలబడి కనిపించాడు. వకుళని చూడగానే అతను నవ్వబోయాడు. కానీ వకుళ వురిమి చూడటంతో, అతని పెదవులమీద నవ్వు మీట నొక్కినట్టు ఆగిపోయింది.

మరోసారి, ఒక ఇంటర్వ్యూకి వెళ్లి వస్తుంటే, బయట జోరుగా వాన పడుతోంది.

అతను ఆటోలో ఎక్కబోతున్నాడు!

అక్కడ బస్సుకోసం, వానలో తడుస్తూ, వంటరిగా, నిలబడిన వకుళని చూసి, "బస్సు యిప్పుడప్పుడే రాదు. వాన తగ్గేట్టులేదు. వస్తారా? లిఫ్ట్ యిస్తాను," అన్నాడు.

"థాంక్ యూ!" షటప్ అన్నంత తీవ్రంగా అంది. "ఇడియట్." మనసులోనే తిట్టుకుంది. ఆ తిట్టు అతనికి ఆమె కళ్లలో కనిపించింది కాబోలు, భుజాలు కుదించి, "మీ యిష్టం," అని వెళ్ళిపోయాడు.

"లిఫ్ట్ యిస్తాట్ట! అతనితో కలిసి ఆటోలో వెళితే నా పరువేంకాను! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు!" అనుకుంది. వర్షంలో తడవటంతో జ్వరం వచ్చింది. లంఖణాలు చేసింది. తెగించి, ధైర్యంలేని మనిషికి, జీవితం అప్పుడప్పుడూ అలా శిక్షిస్తుందని వకుళకి తెలియదు.

ఆనాటినుంచీ, అతను మళ్ళీ కన్పిం

చినా ఎన్నడూ పలకరించలేదు. కానీ చూడటం మాత్రం మానలేదు. కానీ ఆ చూపులు మారినాయి. అవి యిప్పుడు యిదివరకులా స్నేహంగా కాకుండా, నిరసనగా వుంటున్నాయి.

ఎప్పుడైనా ఎక్కడైనా కన్పిస్తే ఎరగనట్టే వెళ్లిపోయేవాడు.

ఈ రోజునకూడా అలాగే వెళ్లి పోతున్న అతను, ''ఇంటర్వ్యూకి వస్తున్నారా?'' అని వకుళ అడుగుతుంటే సమాధానం చెప్పటం మరిచిపోయి నట్లుగా తెల్లబోయి చూస్తున్నాడు.

"మిమ్మల్నే" అంది.

అతను ఈ లోకంలోకి వచ్చినట్లుగా చప్పున తల వూపాడు.

"అది అయిపోయి, చాలా సేప యింది.''

''ఐసీ! ఇంటర్వ్యూకి అందుకోలేనేమోనని నేను అప్పుడే అనుకున్నాను. కానీ ఆశ చావలేదు. ఇంట్లో వుండనీయ లేదు. అదృష్టం ఏదయినా గమత్ చేయ బోతుందా అనుకున్నాను.'' అతనుకూడా వెనక్కు తిరిగి, వకుళతోపాటు బయటకి నడిచాడు.

''మీకు బాధగా లేదా?'' అంది.

''బాధ ఎందుకు? అలా బాధపడుతూ కూర్చుంటే, యింటికి నడవలేం. మళ్లీ యింకో ఇంటర్వ్యూకి వెళ్ళే ఓపిక, వుత్సాహం వుండవు."

"ఈ ప్రయత్నాలు చేయటం, ఓడి పోవటం, మీకు విసుగు రావటంలేదా?''

"విసుగు వస్తే ఎలా? ప్రయత్నం చేస్తూనే వుండాలి. ప్రయత్నం చేయ కుండా, రావటానికి నేనేమైనా లక్షాధి కారి బిడ్డనా? మినిస్టర్‌గారి కొడుకునా?''

''మీకు చాలా ఓపికలా వుంది.''

''ఓపిక పడితే, కనీసం యీ సహనానికి మెచ్చి అయినా, అవకాశం ఎప్పుడో ఒకసారి తలుపు తెరుస్తుందని ఆశ!"

''భలేవారే!'' వకుళ నవ్వింది.

''మన మధ్యతరగతి వాళ్ల కీ ఓపిక ఒక్కటే వజ్రాయుధం అనుకోండి.'' అతనుకూడా నవ్వాడు.

వకుళకి అతని భావం అర్థమైంది! ఇంతక్రితం తను వాచీ పోయిన బాధని అదిమి పెట్టుకోలా!

ఇదికూడా అలాటిదే!

వకుళ కతను మనం మధ్యతరగతి వాళ్లం అన్నందుకు చిరాకు వేసింది.

వీళ్ల యిరుకు జీవితాలు, తెరిపిలేని భవిష్యత్తులు అంటే మహావిసుగు.

వకుళకి మళ్ళీ కిక్కిరిసిన బస్సు కళ్ళముందు కదిలింది.

జనాల్ని తోసుకుంటూ, బస్సు ఎక్కి దిగినట్టే, యీ నిరాశలని, ఈ భయాలని, ఆశాభంగాల్ని తోసుకుంటూ తిరగాలి! బాధల్ని అణచుకోవాలి. అన్నింటిని భరించాలి! ఈ జీవితాలకి ముక్తి వుండదు! ఈ బస్సుల్లో తెరిపి వుండదు!

''మీరెందుకింత ఆలస్యం అయారు?'' అని అడిగింది.

అతను తన షర్ట్‌వైపు చూపించాడు.

''నా బట్టలు కారణం! ఇంటర్వ్యూకి రావాలనే తొందరలో, ఆ ఆదుర్దాలో, మేకుకి తగిలించిన షర్టుని గట్టిగా లాగాను! పాతదేమో! పట్టున చిరిగి పోయింది.! నాకున్నవి రెండే రెండు మంచి షర్టులు. ఒకటి మా అమ్మ సబ్బులో తడిపి పెట్టింది. రెండోది చిరిగింది! నా అవస్థ ఏం చెప్పమంటారు! మా యింటాయన దగ్గరకు పరుగెత్తి, ఆయన్ని బదులు అడిగి ఈ షర్ట్ తెచ్చుకున్నాను. ఆయనకి షర్ట్ పాడు చేయకుండా తిరిగి జాగ్రత్తగా తెస్తానని, నేను ఎప్పుడూ వేయనన్ని ఒట్లు వేసాను. ఆయన్ని నమ్మించి యిది తీసుకోటానికి రెండు గంటలు పట్టింది."

''అయ్యో!'' వకుళ చేయి నోటి దగ్గర పెట్టుకుంది. ఆ అయ్యో అనటం షర్ట్ చిరిగినందుకు కాదు. ఇంతక్రితం అతన్ని చూడగానే, భుజాలదగ్గర, పొట్ట దగ్గర వదులుగా వేళ్ళాడుతున్న ఆ షర్ట్ చూసి, తను లోలోపలే నవ్వుకున్నందుకు.

ఇద్దరూ నడిచి వస్తున్నారు.

ఒక కారు పక్కనున్న హోటల్లోకి వెళుతూ, అడ్డం రావటంతో ఆగారు.

ఇద్దరూ అప్రయత్నంగా, కారు వెళ్ళిన వైపే తలలు తిప్పి చూశారు.

అక్కడ ఆరుబయటగా వున్న ఆవరణలో, పచ్చటి చెట్లమధ్య, రంగు రంగు గొడుగులక్రింద కూర్చుని, జనం టిఫిన్లు తింటున్నారు. వకుళ వుస్సురన్నట్టు నిట్టూర్పు విడిచింది! అక్కడికి వెళ్ళి కూర్చుని వేడివేడిగా ఏదయినా తినాలని వుంది. కానీ బాగ్‌లో డబ్బులు లేవు.

''మీరేమీ అనుకోనంటే ఒకటి అడుగుతాను.'' జంకుగా అన్నాడతను.

''ఏమిటి?''

''అక్కడకు వెళ్ళి ఒక కప్పు వేడి వేడి కాఫీ తాగుదాం! కాస్త యీ నీరసం తగ్గుతుంది. ఏమంటారు? అహహ—మీకు యిష్టం అయితేనే సుమా!" కాఫీవరకే అయితే ఫర్వాలేదు. బాగ్‌లో డబ్బులు ధైర్యం చెప్పాయి.

''పదండి.'' దారి తీసింది.

''థాంక్ యూ!'' అతని ముఖంలో వుత్సాహం వెలిగింది,

ఇద్దరూ లోపలకు వచ్చారు.

అక్కడున్న చోటులో, ఏ మూల కూర్చోవాలో వకుళే ఎన్నిక చేసింది.

''ఏ మూల కూర్చున్నా, మనం తాగే కాఫీ ఒకటే కదా!'' అన్నాడతను వేదాంతంగా.

అతను టిఫెన్‌కి ఆర్డర్ ఇస్తుంటే వకుళకి భయంవేసింది,

''నా దగ్గర ఎక్కువ డబ్బులు



లేవు.'' అంది తెచ్చిపెట్టుకున్న నవ్వుతో. అతను నవ్వాడు.

''మీ డబ్బులు యిక్కడెవ్వరూ ఖర్చుపెట్టడం లేదులెండి.''

టిఫిన్ తింటూ మొదటిసారిగా, యిద్దరూ ఒకరిని గురించి ఒకరు తెలుసుకున్నారు.

"నా తలితండ్రులకి నేను ఒక్కతినే కూతురుని. నాపైన నలుగురూ మగపిల్లలే! అందరికీ పెళ్లిళ్ళు అయినాయి! వుద్యోగాలరీత్యా వేరే వూళ్ళలో వుంటున్నారు.'' వకుళ చెప్పింది.

''ఆఖరి సంతానం కాబట్టి మీ కుటుంబంలో మీకు బాగా గారాబం వుండి వుంటుంది,'' అన్నాడతను.

"అదేం లేదు. అన్నయ్యలది ఎవరి గొడవ వాళ్ళది. మా అమ్మకి నేనే ఆధారం.''

"అలాగా."

"మీరు?"

"నేను యింటికి పెద్దకొడుకుని." ఒక్క క్షణం అతని ముఖంలో నీడలు తొంగి చూసినాయి. "నాన్న యాక్సిడెంట్‌లో నా చిన్నప్పుడే పోయారు. మా అమ్మ టీచర్ చేస్తోంది. నాకు ముగ్గురు చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. వాడికి చిన్నప్పటినుంచీ గుండెజబ్బు. నెలకోసారి అది వాడి ప్రాణంమీదికి తెచ్చి మా ప్రాణాలు తినేస్తూ వుంటుంది. చెల్లెళ్ళంతా చదువులో వున్నారు."

అతను నిట్టూర్పు ఆపుకోలేకపోయాడు. ''మా కుటుంబానికి మా అమ్మే ఆధారం! నేను చదువు పూర్తి అయికూడా ఆవిడమీద ఆధారపడి బ్రతుకుతున్న మగధీరుణ్ణి.'' అతని కళ్ళలో ఆవేదన, నిస్సహాయత్వం, అవి కన్పించకుండా వుండాలని అతను చేసే ప్రయత్నం వకుళ ఆసక్తిగా గమనిస్తోంది.

"ఇద్దరు చెల్లెళ్ళు పెళ్ళిళ్ళకి ఎదిగారు.

అపో్ప సపో్పచేసి ముందు అవి ముడి పడేలా చూడాలి. అమ్మని చూస్తే జాలేస్తుంది. ఎన్నాళ్ళని అలా గంధం చెక్కలా మా కోసం అరుగుతుంది! నాకేమో వుద్యోగం దొరికే మార్గమే కనిపించటంలేదు. మా బాధలకి తోడు మా అమ్మమ్మని మా మామయ్యలు మా యింటికే తోసేసారు. ఆవిడ ఒకసుస్తీ మనిషి. ఎంత చేసినా సణుగుతూనే వుంటుంది.''

"థాంక్ గాడ్! మీకంటే నేనే నయం. నా కలాటి బాధలేవీ లేవు!

నేనుకూడా మీలాగే ఆలోచించి సంతృప్తిపడుతూ వుంటాను. నా స్నేహితుడు ఒకడున్నాడు. బస్సు ఎక్కబోతూ జారిపడి రెండు కాళ్ళూ పోగొట్టుకున్నాడు. వాడికి వైద్యం లేదు. మరణం రాదు. మంచంలో వున్నవాడి బ్రతుకు ఎంత దుర్భరమో చూడలేం. వాడిని చూసి, నేను చాలా అదృష్టవంతుడిని. నా కలాటి బాధలేవీ లేవు అనుకుంటూ వుంటాను."

ఇంతలో అక్కడికి ఒక తెల్లటికారు వచ్చి ఆగింది!

దానినిండా క్రిక్కిరిసినట్టు ఎక్కిన అమ్మాయిలు, అబ్బాయిలు. బిలబిలలాడుతూ దిగారు.

అమ్మాయిలంతా షాపుల్లో ప్రదర్శనకి పెట్టే బొమ్మల్లా, ఆరోగ్యంగా రకరకాల దుస్తులు ధరించి వున్నారు. వాళ్ల పొట్టి జుట్లు. లోతుమెడ దుస్తులు, పూసల నగలు ఆకర్షణీయంగా వున్నాయి ఇక అబ్బాయిలు చెప్పనే అవసరంలేదు. వాళ్ళ ముదురు రందు బట్టలు, పెరిగిన జుట్టు ఓహోహో అనే నవ్వులతో, విలాసంగా ఈ ప్రపంచం అంతా వాళ్ళకి ఒక వినోదమైన స్థలంగా భావిస్తున్న వాళ్లా వున్నారు.

వకుళకి వాళ్ళని చూడగానే, హఠాత్తుగా, తన ఎదురుగా వున్న యితన్ని చూడగానే అనంతృప్తి కలిగింది. అతనితో కలిసి తనిలా కాఫీకి రావటం సిగ్గనిపించింది! అతని వదులు చొక్కా చూసి, అతనితోపాటు వున్న తనని చూసి వాళ్లెంత నవ్వుకుంటారోననే బెంగ కలిగింది!

"వాళ్ళవైపు చూస్తూ, మీ కాఫీ చల్లార పెట్టుకోండి." అతను హెచ్చరించాడు.

ఇంతలో ఒక పెద్దాయన వీళ్ళ టేబిల్ దగ్గరకి వచ్చాడు.

"ఏరా వాసూ! అమ్మ బాగుందా!'' అంటూ పలకరించాడు.

ఆయన అతన్ని పలకరిస్తున్నాడే గానీ, చూపులన్నీ వకుళమీదనే వున్నాయి.

"బాగానే వుంది బాబాయ్. నువ్వు వూరునుంచి ఎప్పుడు వచ్చావు?" అతను లేచి ఎంతో మర్యాదగా అడిగాడు.

"పొద్దున్నే వచ్చానుగాని, యీ అమ్మాయి ఎవరు!" ఆయన ఆరాగా చూసాడు.

''ఈ అమ్మాయి నా స్నేహితురాలు- పేరు..." అతను ఆగాడు.

''నా పేరు వకుళండీ." చప్పున చెప్పింది.

"అలాగా. మా వాసుగాడికి ఆడ స్నేహితులున్నారని నాకు యింతవరకూ తెలియదు. వాసూ! అమ్మతో, నేను రేపు కన్పిస్తానని చెప్పు,'' అని ఆయన వకుళ వైపు ఎగాదిగా చూసినట్టు చూసి వెళ్ళిపోయాడు. వకుళకి ఆ చూపులు ముళ్ళు గుచ్చుకున్నట్లుగా వున్నాయి.

"క్షమించాలి. నా స్నేహితురాలని చెప్పేసాను. మనం కలిసి కాఫీ తాగుతున్నాం. పరిచయం లేదంటే ఆయన నమ్మడు." ఆయనే కాదు, ఆ ఎదురుగా కూర్చున్న ఆ ఫాషన్ గలవాళ్ళుకూడా నమ్మరు. అనుకుంది.

''మీ పేరు వాసా?" అంది.

"అవును. శ్రీనివాసమూర్తి" మా అమ్మ శీనూ అని, స్నేహితులు వాసూ అని పిలుస్తారు.

మనిషిలాగానే పేరుకూడా మామూలుగా వుంది.

"మీ పేరు బాగుంది." మెచ్చుకున్నాడతను.

"నా అసలు పేరు వెంకటలక్ష్మి. నేను వకుళ అని మార్చుకున్నాను." అని చెప్పలేదు వకుళ.

వకుళ బిల్ చెల్లిస్తానని అంటే, అతను యివ్వనీయలేదు.

ఇద్దరూ బస్‌స్టాండ్ దగ్గరకి వచ్చారు. వకుళ భయపడినట్టుగా, అతను వకుళతోపాటు బస్సు ఎక్కలేదు.

"నాకు నడవాలని వుంది. ఇప్పుడే యింటికి వెళితే, మా అమ్మమ్మ సణుగుడు వింటూ కూర్చోవాలి." చెయి వూపుతూ అన్నాడు.

వకుళ యింటికి వచ్చింది.

తల్లి గుమ్మంలోనే ఎదురు చూస్తునట్టుగా నిలబడి వుంది.

''ఏమయిందే తల్లీ?"

"వుద్యోగం రాలేదమ్మా."

''ఒక్క పావుగంటముందు రాకపోయావుటే! విజయనగరం అత్తయ్య, మీనాక్షమ్మగారిని, కొడుకునీ తీసుకు వచ్చింది. వాళ్ళు నీకోసం చాలాసేపు చూసి వెళ్ళారు."

వకుళ మనసులో చెప్పలేనంత నిరుత్సాహం వచ్చేసింది.

ఈ జీవితానికి ప్రతిదీ ఆలస్యమేగా! అయినా ఎన్నడూ లేనిది ఈ రోజు యిలా కాఫీ తాగాలని బుద్ధి పుట్టిందేమిటి? విజయనగరం అత్తయ్య చాలా రోజులనుంచి తీసుకు వస్తానని వూరిస్తున్నవాళ్ళు యీ పూటే రావాలా! విజయనగరం అత్తయ్య ఎంతో మురిపెంగా చెబుతున్న ఆ మీనాక్షమ్మ కొడుకు రైల్వేలో పనిచేస్తున్నాడు.

మంచి జీతమే! అతనిని మాధవి పెళ్ళిలో చూసింది. పేరు రాజా. రాజా లాగానే ఠీవిగా వుంటాడు. అతని ముఖా నికి ఆ కళ్ళజోడుకూడా ఎంత కళో!

"మీనాక్షమ్మగారు అసలివాళ రావా లని అనుకోలేదుట. ఈ పక్కవీధిలో స్నేహితుల యింటికి పెళ్ళికి వచ్చారుట! తల్లి ఏదేదో చెబుతూనే వుంది. తననిగురించి వాళ్ళు విన్నారు. మళ్ళీ రాకపోతారా! మనసులో ఆశ రెక్కలు విప్పుకుంది.

రాజాని వరుడుగా వూహించుకుం టుంటే, వకుళ మనసు ఆనందడోలికలు వూగులాడసాగింది!

మీనాక్షమ్మగారు కూతురి పురిటి కోసం బొంబాయి వెళ్ళటంతో, ఆవిడ రాకకోసం వేచి చూస్తున్నారు.

దాదాపు నెలరోజుల తర్వాత – ఈ మధ్యలో వకుళ రెండు ఇంటర్వ్యూలకి వెళ్ళింది. కానీ శ్రీనివాసమూర్తి కని పించలేదు.

హఠాత్తుగా ఒకరోజు బస్‌స్టాప్‌లో కనిపించాడు. అతను గుండు చేయించు కుని వున్నాడు. అతను దగ్గరగా వచ్చి పలకరిస్తుంటే, క్షణంసేపు గుర్తుపట్ట లేకపోయింది.

"మీరా! అదేమిటి – జుట్టు! తిరుపతి వెళ్ళారా?" అంది.

అప్పుడు గాని అతనికి తన గుండు సంగతి గుర్తు రాలేదల్లే వుంది.

"లేదు మా అమ్మ పోయింది." తల తడుముకుంటూ అన్నాడు.

"అరెరె. ఏమిటి సుస్తీ?"

"హార్ట్ ఎటాక్."

"మీ అమ్మమ్మ ఎలా వున్నారు?"

"నిక్షేపంగా వుంది."

బస్ ఎంతసేపటికీ రాకపోవటంతో యిద్దరూ నడక సాగించారు.

"నాకు వుద్యోగం దొరికింది." అన్నాడతను.

"నిజంగా! కంగ్రాచ్యులేషన్స్" అంది.

అతను తనకి వుద్యోగం యిచ్చిన ప్రయివేట్ కంపెనీ గురించి చెప్పాడు.

''జీతం ఎంత?" వుత్సాహంగా అడిగింది.

అతను చెప్పిన సంఖ్య విని ''ఓస్, ఇంతేనా? ఆ జీతం గవర్నమెంట్ ప్యూన్‌కి వస్తోంది." అంది

అతను చిన్నబుచ్చుకోలేదు. నవ్వాడు.

''నేనుకూడా అదే అనుకున్నాను. కానీ ఏంచేస్తాం! ప్రస్తుతానికి అవసరం అలాటిది. గుడ్డికళ్ళకంటే మెల్లకన్ను నయం అంటారే అదన్నమాట! కంపెనీ మంచిది లెండి. కష్టపడితే త్వరగా ప్రమోషన్స్ వస్తాయిట."

''ఈ లోపల మీ తల నెరిసిపోతుంది. మీ నడుం ఒంగిపోతుంది."

"అంతే అనుకుంటూ!" అతను మళ్ళీ గుండు తడుముకున్నాడు.

ఛి. ఛీ! ఏం మనిషి! అలా గుండుతో తిరగకపోతే కాస్త అందమైన టోపీ పెట్టుకోకూడదూ అనుకుంది.

ఇద్దరూ నడుస్తూనే వున్నారు. అతను చేతిలో పట్టుకున్న కూరల సంచీ మరో చేతిలోకి మార్చుకున్నాడు.

ఇద్దరిమధ్యా గంభీరమైన నిశ్శబ్దం ఏర్పడింది. హఠాత్తుగా అతని నోటి నుంచి మాటలు రావటం ఆగిపోయాయి! ఒకసారి పాంట్ జేబులోనుంచి జేబు రుమాలు తీసి, ముఖానలేని చమటని గట్టిగా తుడుచుకున్నాడు.

అతనేదో అడగటానికి సతమతమౌ తున్నాడని గ్రహించింది. కానీ ఏమి టది అని తనంతట తను అడగలేదు.

''వకుళా." అతను పిల్చాడు.

''ఏమిటి?"

అతను తడబాటుగా గొంతు సవరిం చుకున్నాడు.

"చెప్పండి. ఏమిటది? డబ్బేమైనా అప్పు కావాలా?"

అతను తెల్లబోయినట్టు చూసాడు. ముఖం కందిపోయింది.

''నో! నో! థాంక్ యూ!"

''మరేమిటి?"

''నేను యమ్. యస్ సి. పాస య్యాను. తెలుసుగా."

"తెలుసు!"

"నాకు చెల్లెళ్ళు తమ్ముడు వున్నారు. తండ్రి లేడు."

"ఇప్పుడు తల్లికూడా లేదు. ఇవి నాకు తెలిసినవేగా!"

"మీరేమీ అనుకోకపోతే, మీ కభ్యం తరం లేకపోతే,మనం...మనం వివాహం చేసుకుందాం." ఎవరో తరుముకు వచ్చి నంత గబగబా ఖంగారుగా అనేసాడు.

వకుళ పిడుగు పడినట్టుగా చూసింది.

నా యీ ధైర్యాన్ని మీరు మరోలా అనుకోవద్దు. సుభద్రమ్మగారు మీకు తెలుసుగా. ఆమెద్వారా మీ కుటుంబ పరిస్థితి యీ మధ్యనే నాకు బాగా తెలి సింది? అందుకే యిలా అడిగాను. మీ రేమీ అనుకోవటం లేదుగా.''

"ఉహు!'' కోపం బిగబట్టుకుంటూ అంది.

"మీకు తండ్రి లేడు. అన్నదమ్ములు మీ సంగతి పట్టించుకోవటంలేదు. మనం బుద్ధి తెలిసినవాళ్ళం. ఇలాటివి సూటిగా మాట్లాడుకోవటంలో తప్పేం లేదనుకుంటా.''

వకుళ మాట్లాడలేదు.

''తొందరేంలేదు. మీరు బాగా ఆలోచించే చెప్పండి."

"అలాగే."

''ఎప్పుడు చెబుతారు?" వుత్సా హంగా అడిగాడు.

''వచ్చే ఆదివారం."

''అబ్బా! అన్ని రోజులా! ఆలోచిం చటానికి రెండు రోజులు చాలదూ?"

"సరిపోతే అలాగే వచ్చి చెబుతాను."

''వద్దులెండి. మీకు కావాల్సినంత టైమ్ తీసుకోండి. వచ్చే ఆదివారం యిక్కడే కలుసుకుందాం. మీ రెన్నింటికి వస్తారో చెప్పండి నేను వెయిట్ చేస్తూ వుంటాను."

వకుళ ఆలోచిస్తోంది! వచ్చే ఆదివారం వరకూ యితన్ని ఆశ పెట్టటం దేనికి? ఇప్పుడే నా కిష్టం లేదని చెప్పేస్తే?

''యిలా సాయంత్రం వేళ కలుసుకుందాం. సరేనా?''

''సరే."

అతను వెళ్ళబోయి ఆగాడు. ''ఒక వేళ మీకు యిష్టంలేకపోతే ఏం చేస్తారు?''

"ఏం చెయ్యను ?"

"మీరిక్కడికి రాకండి. అదే నా ప్రశ్నకు జవాబు."

వకుళ తల వూపింది.

అతను వెళ్లిపోయాడు.

వకుళ యింటికి వచ్చింది. మనసంతా రోషంగా, కసిగా, ఆవేశంగా వుంది ! ఆ గుండుగాడి కెంత ధైర్యం ! యిద్దరి మధ్యా ఏ మాత్రం పరిచయం వుందని పెళ్లి చేసుకోమంటున్నాడు ? తన ఆశలేమిటో, కలలేమిటో కనీసం తెలుసుకునేందుకైనా ప్రయత్నించాడా ! పెళ్లి చేసుకోవాలిట... పెళ్లి ! ఇంటి నిండా చెల్లెళ్లు, రోగిష్టి తమ్ముడు, చావటానికి సిద్ధంగా వున్న ముసలమ్మ. చిన్న వుద్యోగం! అది కూడా పర్మనెంట్ దికాదు! అతనితోపాటు తను కూడా వుద్యోగం చెయ్యాలి...చెయ్యక తప్పదు. చేసినా, తెచ్చుకున్నదంతా అతని సంసారానికే ఖర్చు పెట్టాలి! తనకేం మిగులుతుంది? ఆ గుండుగాడితో తనకేం సుఖం వుంటుంది! అలాటి దరిద్రపు పెళ్లి చేసుకునేకంటే, జీవితాంతం కన్యగా వుండిపోవటమే నయం! చాలా తెలివిగలవాడే! మంచి ప్లానే వేసాడు! ఈ రోజుల్లో మగవాళ్లకి ఆడపిల్ల అందచందాలతోపాటు, వుద్యోగాలు చేసే అర్హతలు కూడా కావాలి! డబ్బు, శక్తి, సరదాలు, కోరికలు, కలలు, ఆ మొగుడు అనే మొద్దుకి ధారపోయాలి!

వకుళ శ్రీనివాస మూర్తిని ఒక పిచ్చివాడి క్రింద జమకట్టి జాలిపడి వూరుకుంది.

విజయనగరం అత్తయ్య బొంబాయి నుంచి రాగానే, మీనాక్షమ్మగారిని తీసుకువచ్చింది. అబ్బాయి వేరే వూరు వెళ్లటంతో రావటానికి వీలు కాలేదని చెప్పింది. మీనాక్షమ్మగారికి వకుళ చాలా నచ్చింది.

పిల్లకేం బంగారంలావుంది. అందం, చదువు, గుణం అన్నీ వున్నాయి. నాకు నచ్చిందమ్మా. మావాడు వూరినుంచి రాగానే వచ్చి చూడటమే తరువాయి! వాడికి తప్పకుండా నచ్చుతుంది. ఈ శ్రావణంలో పెళ్లి చేసేద్దాం అంది.

వాళ్లు వెళ్లగానే ఎన్నడూ లేంది, వకుళ మనసు విహంగం అయింది. రంగు రంగు స్వప్నాల వైపు రెక్కలు చాచి పరుగులెత్తసాగింది. వకుళ దాన్ని నిరోధించలేదు. నవ్వు ముఖంతో చూస్తోంది! దాని ఆనందంలో పాలు పంచుకుంది.

రోజులు గడిచాయి. శ్రావణ మాసం సగం దాటిపోతున్నా, మీనాక్షమ్మగారి కొడుకు చూడటానికి రాలేదు. వాళ్లు వస్తారని చూసి చూసి విసుగెత్తిపోయిన వకుళ తల్లి, ఒకనాటి మధ్యాహ్నం, తనే వాళ్ల యింటికి వెళ్లింది. గంటలో వుసూరుమంటూ తిరిగి వచ్చిన తల్లిని చూసి వకుళ గాభరాపడింది.

"ఏమన్నారమ్మా ?"

''ఏమంటారే ! ఆ అబ్బాయి ఆఫీసులో టైపిస్టుని, తల్లికి చెప్పకుండా పెళ్లి చేసుకున్నాట్ట. తల్లికి యిష్టంలేకపోయినా, ఒక్కగానొక్క కొడుకని, ఆ పిల్లని యింటికి రానిచ్చిందిట!"

వకుళ చప్పున పని వున్నదానిలా, తన గదిలోకి వచ్చేసింది. మళ్లీ అదే భావం !

బస్సు తప్పిపోయిన నిరాశ! చెప్పలేని దిగులు! అది చిన్న బాధ అయితే, యిది పెద్ద బాధ! అంతే తేడా!

అప్పుడు కూడా వకుళకి శ్రీనివాస మూర్తి గుర్తురాలేదు.

వకుళకి రెండునెలల తర్వాత బాంక్‌లో వుద్యోగం వచ్చింది. ఈ ప్రపంచపు సామ్రాజ్యం అంతా తనకే కట్టబెట్టినంతగా సంతోషపడిపోయింది.

ఉద్యోగం! సంపాదన! కొత్త వాతావరణం! వకుళకి జీవితం రెక్కలు గుర్రంలా పరుగెత్తుతున్నట్లుగా వుంది.

తల్లిమాత్రం పెళ్లి సంబంధాలు చూడటం మానలేదు.

"అమ్మాయ్, ఒక సంబంధం వుందే! పిల్లాడు పెద్దగా చదువుకోలేదు. అయితేనేం! పల్లెటూరులో, భవంతిలాటి యిల్లుంది! పది ఎకరాల పొలం వుంది."

"అవునవును. వాటితోపాటు అతనికి రాక్షసిలాంటి తల్లి కూడా వుంది." ఆ సంబంధం సంగతి అంతక్రితమే ఎరిగి వున్న వకుళ గయ్యిన లేచింది.

ఆఫీసుకి తయారయి వెళ్లేటప్పుడు తల్లి యిలాటి సోది మొదలు పెడితే, ఆ రోజంతా వకుళ మూడ్ చెదిరిపోతుంది.

"ఇప్పుడు నాకేం తక్కువ అయింది? హాయిగా వుద్యోగం చేసుకుంటున్నాను. ఇష్టం వచ్చిన బట్టలు కట్టుకుంటాను. నా కిష్టమైన సినిమాలు చూస్తాను. ఎంత ఖర్చయినా సరే, నా అభిమాన రచయితల సీరియల్స్ పడిన పత్రికలు ఒక్కటి కూడా వదలకుండా కొనుక్కుంటాను. నన్ను యీ వుద్యోగం




మానిపించగలిగే భర్త దొరికేవరకూ యీ స్వేచ్ఛలోనే సంతృప్తి పడతాను," అనుకునేది. బాంక్‌లో తనతో పనిచేసే వసంత వుదాహరణకి వుందిగా ! చచ్చీ చెడీ అలా వుద్యోగం చేస్తే, భర్త, చేతికి ఒక్కకానీ యివ్వడు. సరైన చీర కట్టుకోదు. కనీసం మంచి గాజులు కూడా వేసుకునేందుకు లేదు. పుస్తకాలన్నా, సినిమాలన్నా ప్రాణం. ఆ రెండూ కావాలంటే, స్నేహితుల దయా ధర్మాలమీద ఆధారపడాల్సిందే! పైనుంచి ఒంట్లో శక్తిని పీల్చి పిప్పిచేసేటందుకు యిద్దరు పిల్లలు! ఛి. ఛీ! ఆ మొగుడు. ఆ పిల్లలు, ఆ నరకం లేకపోతేనేం !

బాంక్‌లో పనిచేసే అందరిలోనూ, తను నీట్‌గా వుంటుంది! అందరి చూపులూ తనమీద అలా యీర్ష్యగా నిలుస్తుంటే, హాయిగా వుంటుంది! తను అందరిలా కాదు! తనకో ప్రత్యేకతవుంది అనుకుంటుంది.

ఒకనాడు బాంక్‌కి శ్రీనివాసమూర్తి వచ్చాడు. అతని కంపెనీ తరఫున లోన్ పనిమీద వచ్చాడు.

అతని జుట్టు మామూలుగా వచ్చేసింది.

వకుళని చూడగానే, అతను ఆశ్చర్యపోయాడు.

"హలో!" మామూలుగానే పలకరించాడు.

"హలో?" నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది.

అతని పని చకచకా పది నిముషాల్లో పూర్తిచేసిపెట్టింది.

అతను బ్రీఫ్‌కేస్ తీసుకుని వెళ్లిపోవటానికి లేవబోతుండగా తనే అనేసింది.

"సారీ! ఆ రోజు రాలేదు నేను!"

లేవబోయిన అతను ఆగాడు.

"నేనప్పుడే అనుకున్నానులెండి. ఈ కాలపు ఆడపిల్లల మనస్తత్వం నాకు బాగానే తెలుసు. కానీ మీరు వేరనుకున్నాను. అది నాపొరపాటే!"

"నా ఎరికలో ఒక అమ్మాయి వుంది, పిల్ల చాలా మంచిది. కాస్తో కూస్తో కట్నం కూడా యిస్తారు."

"నా ఎరికలో కుఱ్ఱాళ్లెవరూ లేరే !"

"నేనడుగుతున్నది మీ సంగతే!"

అతను ఆగాడు. తర్వాత లేచాడు. "థాంక్స్! నన్ను పెళ్లిచేసుకోమన్నాను గాని, పెళ్లిసంబంధాలు చూసిపెట్ట మనలేదే!"

"మీకు తగిన పిల్లని చూసాను."

"అలాగా! సారీ మేడమ్! నా పెళ్లి అయి ఆర్నెల్లు అయింది. నేను తండ్రిని కాబోతున్నాను కూడా!" అతను వెళ్లిపోయాడు.

వకుళ వెక్కిరింత, హేళన, ఎగిరిపోగా మూగదానిలా చూస్తుండిపోయింది! అతనికి పెళ్లి అయిందా! పాపం. ఎవరో ఆ నిర్భాగ్యురాలు అనుకుంది.

ఆ తర్వాత అతను మళ్లీ కనిపించలేదు.

వకుళ ఆఫీసులో చేరిన తర్వాత జీవితం గడియారపుముల్లు అయి

పోయింది! ఒకే క్రమం! ఒకే దిశ! మార్పులు, చేర్పులూ ఏవీ లేవు! ఆటు పోట్లు ఏమీ లేకపోవటంతో, కాలం నత్తనడకలా అయిపోయింది! బాంక్‌లో వున్న కుర్చీలు, బల్లలులా తాను కూడా ఆ బాంక్‌కి అంకితం అయి స్వంతం అయిపోయినట్లుగా వుంది.

ఎనిమిది సంవత్సరాలు యిట్టే గడిచి పోయినాయి!

ఈ ఎనిమిది సంవత్సరాలలో, నచ్చిన చీరెలు కొనుక్కోవటం, నచ్చిన కొత్త సినిమాలు మొదటిరోజునే చూడటం, తెలుగుదేశంలో ప్రచురింపబడిన ప్రతి కథల పత్రికనీ చదవటం మినహా వకుళ చేసిన ఘనకార్యం ఏమీ లేదు.

ఈ మధ్యనే తల్లి పోవటంతో, ఒంటరితనం తోడుగా లభించింది. వుద్యోగరీత్యా వేరే వూళ్లలో వున్న అన్నదమ్ములు వకుళని వుద్యోగం మానేసి తమతో వుండమని అడిగారు. ఆ విషయం అసంభవం అని, వాళ్ల అది తెలిసే మర్యాద దక్కించుకోవటానికి అడిగారని తెలుసుకున్న వకుళకి వాళ్లంటే అసహ్యంవేసింది. ఎందుకీ నాటకాలు? మనుష్యులు సూటిగా, మనసుల్లో వున్నవి ఎందుకు చెప్పరు ? అనుకుంది.

తల్లిపోయిన వకుళని పినతల్లి ఆప్యాయంగా యింటికి తీసుకువెళ్లి అట్టిపెట్టుకుంది. వకుళ మొదట యీ ఆత్మీయతకి చలించిపోయింది. కళ్లలో నీళ్లు వుబికి రాగా, అక్కయ్య యిలా దగ్గరకు తీయకపోతే నేను ఏమయిపోయేదాన్ని, అనుకుంది.

కానీ ఆర్నెల్లు గడవకముందే ఆ ఆత్మీయతలో అంతరార్థం తెలిసి వచ్చింది. తనని దగ్గరకు తీయటంలో ఆవిడ స్వార్థం చాలా వుంది. తన జీతంలో సగం పైగా ఆవిడ చేతికే యిచ్చేది. మిగతాదాంట్లో, తను ఓవల్టీన్, పళ్లు, బిస్కెట్స్ లాటివి తెచ్చుకుంటే, వారంరోజులలోపల, ఆవిడా, పిల్లలూ వాటిని స్వాహా చేసేవాళ్లు. శలవు రోజున చచ్చిచెడి వుతికి, యిస్త్రీ చేసుకుని బీరువాలో దాచుకున్న చీరెలన్నీ ఆవిడ చీటికీ మాటికీ కట్టేసేది. పైనుంచి ఏదో ఒక అవసరం పేరు పెట్టి, ఆఫీసులో డబ్బు లోన్ తీసుకోమనేది. ఆదివారాలు వస్తే, పిల్లల్ని తనదగ్గర వదిలి, ఆవిడ భర్తని తీసుకుని సినిమాకి చెక్కేసేది. వకుళకి ఆదివారం వచ్చిందంటే పుట్టెడు దిగులు వచ్చేది. ఇంటెడు చాకిరీ మీదపడేది. అయ్యో ! వాళ్ల నీడన వుంటున్నాను. నేనిది బరువు అనుకోకూడదు అని సరిపెట్టుకునేది.

కానీ అక్క అందరితో, వకుళని తమ యింట్లో వుంచుకుని, వుద్ధరిస్తున్నట్లుగా మాట్లాడటం వినగానే ఒళ్లు మండిపోయింది. ఆవిడతో, ఘర్షణ పడింది!

పెట్టే బేడా సర్దుకుని హాస్టల్లో చేరేసింది!

వకుళతో దెబ్బలాడిన అక్క అందరితో, "మా యింట్లో అదెక్కడ వుంటుందండీ ? నాదంతా ఖచ్చితమైన పద్ధతి. వేళకి యింటికి రావాలి. మగ స్నేహితులతో తిరగద్దు. కావాలంటే పెళ్లిచేసుకో అన్నాను. ఈ కట్టడి దానికి నచ్చలేదు. అయినా మగరాయళ్లలా స్వేచ్ఛగా తిరగటానికి అలవాటు పడ్డ ఆడపిల్లలని మనం కంట్రోల్ చేయలేం," అంటూ ప్రచారం చేసింది.

ఈ ప్రచారం వినగానే వకుళకి పెద్ద పెట్టున ఏడుపు వచ్చింది. ప్రవర్తన విషయంలో, తను ఎంత ఖచ్చితంగా వుంటుంది ! ఇన్ని సంవత్సరాలనుంచి వుద్యోగం చేస్తున్నా, ఒక్కడు కూడా తనని వేలెత్తి చూపించలేనంత జాగ్రత్తగా మసులుకుంది. ఈవిడ పుణ్యమా అని తన జాగ్రత్త అంతా బూడిదలో పోసిన పన్నీరు అయింది.

అక్క యింట్లో పోరు తప్పుతుందని, హాస్టల్లో చేరితే, అక్కడ చప్పిడి తిండితో పెద్ద నీరసం రాసాగింది! వకుళ స్నేహితురాళ్లు యిద్దరు యీ వూళ్లోనేవున్నారు. వాళ్లు మంచివాళ్లు! ఎప్పుడూ వకుళని రమ్మని గొడవ చేస్తూంటారు. ఈమధ్య ఆఫీసు, హాసలుతో విసుగెత్తిపోయిన వకుళ వాళ్ల పిల్లలతో వాళ్లమధ్య, సరదాగా గడపాలనే ఆశతో వెళ్లేది! ఆ స్నేహితురాళ్ల భర్తల చూపులు వకుళకి నచ్చేవి కావు! అంగడిలో మిఠాయిని చూసినట్టు చూసేవాళ్లు. వకుళ క్రమంగా ఆ యిళ్లకి కూడా రాకపోకలు తగ్గించింది.

తను మంచిచీర కట్టుకుంటే, ఆఫీసులో మిగతా ఆడవాళ్లు, "నీకేమ్మా! హాయిగా ఒంటరిదానివి! ఎన్నయినా కట్టుకుంటావు. మాకెలా కుదురుతుంది?" అనేవాళ్లు. వకుళకి ఈ సూటి పోటీ మాటలు అలవాటయిపోయినాయి. అసలు వాళ్ల మధ్య ఒక అరగంట కూర్చోవాలంటేనే చెడ్డ విసుగ్గావుండేది. నలుగురు కలిసారంటే చాలు...భర్తలు, పిల్లలు, డబ్బు యిబ్బందులు యివే కబుర్లు. వాళ్ల తప్పేంవుంది. అది వాళ్ల లోకం. వాళ్లకి అది మినహాయింకేం అవసరంలేదు.

తల్లి గుర్తుకు వస్తే చాలు, తన పెళ్లి సంగతి గుర్తుకువచ్చేది. ఆవిడ బ్రతికి వున్నన్ని రోజులూ, తన గురించే దిగులుపడింది. ఏంచేస్తూంది తను ? తనకి నచ్చిన వ్యక్తి ఒక్కరు కూడా కనిపించలేదయ్యో!

ఆ మధ్య చాలా సంబంధాలు వచ్చాయి కానీ వాళ్లంతా, తనకంటే, తన వుద్యోగం చూసి పెళ్లిచేసుకోవటానికి యిష్టపడుతున్నారని తెలిసి చిరాకు

పుట్టింది. "నా సంపాదన తీసుకెళ్లి ఛస్తే వాళ్ల చేతుల్లో పోయను. నన్ను నన్నుగా చూసి, నన్ను పువ్వుల్లో పెట్టి పూజించుకునే భర్త నాకు కావాలి," అనుకుంది. కానీ సంవత్సరాలు గడిచి పోయినాయి తప్ప, అలాంటి వ్యక్తి వకుళకి ఎదురవలేదు.

వకుళ యీ మధ్య జ్వరపడింది. అది టైఫాయిడ్‌గా మారి, వేధించి, వంటరి తనంతో కృంగదీసి, తర్వాత తగ్గింది.

జ్వరపడి లేచిన తర్వాత, వకుళకి కోపం, చిరాకు ఎక్కువయిపోయినయి! ఆఫీసులో వుంటే, హాస్టల్‌కి వెళ్లిపోబుద్ధే స్తుంది! హాస్టల్‌కి వస్తే, ఆఫీసే నయం అనిపిస్తుంది! ఎక్కడా శాంతిలేదు.

ఇదివరకు కొత్త సినిమా ఎప్పుడు రిలీజు అవుతుందా అని ఎదురుచూసేది! ఆ సినిమాల్లో అభిమాన హీరో శృంగార ఘట్టాలు చూస్తుంటే ఒళ్లు పులకరించేది! మనసు తీయటి బాధతో మైమరిచేది ! ఇప్పుడు ఒళ్లుమండిపోతుంది! పళ్లు నూర బుద్ధేస్తుంది! పత్రికలు కూడా అంతే! వారం, వారం సీరియల్స్ ఎప్పుడు వస్తాయా అని ఆతురతగా వుండేది! ఇప్పుడు అభిమాన రచయిత్రుల పేర్లు చెబితేనే మంట! వీళ్లకి పనీ పాటూలేదు అనుకుంది! ఈ ప్రపంచం అంతా కలిసి తనని ఒంటరిదాన్ని చేసిందనే ఆగ్రహం! అందరూ తన కంటే సుఖంగా వుంటున్నారనే విచారం, తన జీవితం యిలాగే వృథా అయిపోతుందేమోననే భయం, తనకి తగిన అదృష్టం దిక్కలేదనే అసంతృప్తి, ఎక్కువై పోసాగినయి.

అప్పుడు తల్లి బ్రతికి వున్నప్పుడు, ఏదో ఒక పెళ్లిలే అనుకుని చేసుకునే కంటే, హాయిగా వుద్యోగం చేసుకోవటం నయం అనిపించింది ! ఇప్పుడు 8 సంవత్సరాల తర్వాత, దాదాపు నడివయసు ప్రారంభం అవుతున్న యీసమయంలో, శరీరం కన్యగానే వుండిపోయినా, వయసు తన ముద్రవేయటం మాన లేదు.

మొన్న జ్వరంపడినప్పుడు, మందు వేసుకున్నావా లేదా అని అడిగే దిక్కు కూడా లేదని తెలిసివచ్చినప్పుడు, తను చేసుకున్న నిర్ణయం సరి అయినది కాదేమోనని బెంగ మొదలైంది!

అద్దంలో చూసుకుంటూ తలదువ్వు కుంటున్న వకుళకి, చెంపల దగ్గర తెల్ల వెంట్రుకలు కనిపించగానే గుండె ఝల్లు మంది.

అమ్మో! అప్పుడే ముసలితనమా ! చచ్చిపోవాలన్నంత ఏడుపు వచ్చేసింది! జీవితం ఏం అనుభవించిందని ! ఏ సరదాలు లభించాయని ! మనసంతా అయోమయంగా అయిపోయింది! ఆ రోజంతా దిగులుగా మంచంమీద పడుకునే గడిపింది.

ఆ విధంగా వారానికి ఏ ఒకసారో అయోమయంగా అవుతూనేవుంది! ఆ పూట యిక ఆఫీసుకి వెళ్లలేదు! అదొక బంధిఖానాలా కన్పిస్తుంది! తన జీవితం ఆ కటకటాల మధ్య అంకితం అయినట్టుగా, యిక విముక్తి లేనట్టుగా వుంటుంది! జూలో బోనులో తిరగాడే జంతువులు గుర్తుకువస్తాయి ! అవి అందులో చచ్చిపోవాల్సిందే తప్ప విడుదల ఎక్కడుంది. ఇలాంటి ఆలోచనల్తో తిక్కరేగినప్పుడల్లా, బజారు బయలుదేరి కొద్దిసేపు అలా తిరిగి వస్తుంది.

వకుళ యీ రోజుకూడా అలాగే ఆఫీసు మాని, షాపింగ్‌కి తిరిగి, కావాల్సినవి కొనుక్కుని, కాఫీ తాగటానికి కామత్ హోటల్లోకి వచ్చింది.

అక్కడ చివరి వరసలో కూర్చుని వున్న ఒకవ్యక్తి, బిల్ వేయటంలో, వచ్చిన తేడా గురించి సర్వర్‌ని మందలిస్తున్నాడు. అతను అటువైపు తిరిగి కూర్చుని వుండటంతో ముఖం కనిపించ లేదు! కంఠం ఎక్కడో విన్నట్టుగా వుంది!

అతను ఎందుకో తిరిగి చూసాడు.

ఎవరతను ? శ్రీనివాసమూర్తే!

పలకరించటమా లేక చూడనట్టు వూరుకోవటమా అని తటపటాయిస్తుండగానే, అతనే పలకరించాడు.

"నమస్కారం! బాగున్నారా ?"

"ఆఁ!"

"రండి. యిక్కడ ఖాళీ వుంది." తన కెదురుగావున్న కుర్చీ చూపించాడు. వకుళ వచ్చి కూర్చుంది. సర్వర్ బిల్ సరిచేసి తీసుకురావటానికి వెళుతుంటే, అతనే టిఫిన్ కాఫీ ఆర్డర్ చేసాడు.

ఇద్దరి మధ్యా కాసేపు వుద్యోగ విషయాలు దొర్లినాయి. ఇద్దరికీ వచ్చిన ప్రమోషన్లగురించి మాట్లాడుకున్నారు. అతను పనిచేస్తున్న కంపెనీ ఒక బ్రాంచికి అతను మేనేజరు అయాడట! అతని చెల్లెళ్లలో ఒక అమ్మాయికి పెళ్లి అయిందిట. కాపురం రెండునెలలు కూడా చేయకుండానే భర్త యిష్టం లేదని వచ్చేసిందిట! మిగితావాళ్లకి పెళ్ళిళ్ళు కాలేదు. సుస్తీ తమ్ముడు అలాగే వున్నాడుట. అమ్మమ్మని మాత్రం మామయ్యలు తీసుకు వెళ్లారుట!''

''నేను విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లాను. మళ్లీ ప్రమోషన్‌మీద యీ వూరికి వచ్చాను,'' అన్నాడతను ఈ ఎనిమిదేళ్లలో తను అతన్ని పెళ్లికి తిరస్కరించిందనే విషయం కూడా మర్చిపోయినట్టుగా ఎంతో మామూలుగా మాట్లాతున్నాడు.

"భార్యా, పిల్లలు బాగున్నారా ?" అంది వకుళ.

"పిల్లలు బాగానేవున్నారు."

"అంటే?''

"భార్య పోయింది.ఏడాది దాటింది.''

"అరెరె. ఏమిటి సుస్తీ?"

"ఆ అమ్మాయికి పెళ్లికిముందే హిస్టీరియా వుంది. చెప్పకుండా దాచారు. పిల్లలు పుడితే పోతదన్నారుట. ముగ్గురు పిల్లలు పుట్టారు. కానీ తగ్గలేదు. రెండో పిల్లాడి తర్వాత ఆ హిస్టీరియా పిచ్చి క్రింద మారింది. మూడో పిల్ల పుట్టి నప్పుడు, పురిటిలో పోయింది. ఓ! అదంతా ఒక హెల్!'' అతను జుట్టులోకి వేళ్లు పోనిచ్చుకున్నాడు. అతని జుట్టు చాలా పల్చబడింది. నడినెత్తిన బట్టతల ప్రారంభం స్పష్టంగా కన్పిస్తోంది. సన్నగా రివటలా వుండేవాడు! ఒళ్లు బాగా వచ్చింది! అంతలోనే అతను సర్దు కున్నాడు.

''నా విషయాలు సరే. మీ సంగతి చెప్పండి. మీరు–'' అతని చూపులు ఆమె మెడమీద ప్రశ్నార్థకంగా నిల్చినాయి. ఆ చూపుల అర్థం తెలుసు కున్న వకుళ కళ్లు టేబిల్‌మీదకి వాలినాయి.

"మీరు యింకా పెళ్లిచేసుకోలేదన్న మాట!'' తగ్గుస్వరంలో అన్నాడు.

వకుళ మాట్లాడలేదు.

అతను క్షణంసేపు ఆమెని పరిశీల నగా చూసాడు.

"ఊ! ఇన్ని సంవత్సరాలు అయినా, మీ అభిమాన హీరో, యింకా మీకు సాక్షాత్కరించలేదా?" నవ్వుతూ అడిగాడు.

''అదేమిటి ?" చురుగ్గా తలెత్తింది.

"మీలాంటి ఆడపిల్లలు అంతేగా ! ఏవేవో ఊహలు! ఎక్కడి హీరోలో వచ్చి,మీ ముందు కారు దిగుతారనే ఆశ!"

వకుళ చిత్రంగా, రోషపడకుండా, శాంతంగా అతని మాటలు స్వీక రించింది. అతను సీరియస్‌గా అన్నాడు. "ఆశలు తప్పని నేను అనటం లేదు వకుళాదేవీ! ప్రతి మనిషికీ తప్ప కుండా ఆశలు వుండాలి! కానీ అవి ఏర్పరుచుకునేముందు, మొదట మన కున్న అర్హతలేమిటని మనం ప్రశ్నించు కోవాలి! మీకు నచ్చిన ఆ హీరోలకి, మీరు నచ్చవద్దూ? ఆ హీరోల కలల్లో యింకెలాంటి హీరోయిన్లు వున్నారో! మనం బజారు కెళ్తాం. షాపులో ఖరీ దయిన బట్టలు చాలా వుంటాయి. కానీ మన పర్సులో వున్న డబ్బు మేరకే మనం కొనుక్కుంటాంగాని, యింకేవో బాగున్నంత మాత్రాన మనం కొనుక్కో కలిగినవి కొనకుండా వుండం కదా ! అలా కొనకుండా వస్తే మనంత మూర్ఖులు, అజ్ఞానులు మరొకరు వుండ రన్నమాట ! పెళ్లికి కావాల్సింది డాబు, దర్జా, ఆస్థి, అంతస్తు కాదు. అర్థం చేసు కునే మంచి మనసు. కష్టసుఖాలు ఒక రివి ఒకరు తనవిగానే భావించి, భరించే ఆత్మీయత! అలాంటి మంచిమనసు, ఆత్మీయత కల వ్యక్తిని భర్తగా పొందిన ఆడపిల్ల నా దృష్టిలో ఎంతో భాగ్య వంతురాలు!"

సర్వర్ బిల్ ఇచ్చాడు.

వకుళ తినటం కూడా పూర్తయింది. వకుళ బిల్ తీసుకోవటానికి చెయిజాచే లోపలే అతనే తీసుకున్నాడు. "నాకు ప్రమోషన్లు వచ్చినాయి. యిది నా పార్టీ అనుకోండి. మీరు మరోసారి నన్ను పార్టీకి పిలవండి."

వకుళ మాట్లాడలేదు. ఎన్నో రోజుల తర్వాత చనువుగా, తల్లిలా, మందలిస్తున్నట్టుగా, విసుక్కుంటు న్నట్టుగా మాట్లాడిన వ్యక్తి దొరికి నట్టయింది ఆ క్షణంలో. అతను ఎంతో పరిచయస్తుడిగా, దగ్గరివాడిగా అని పించాడు.

అతను బిల్ చెల్లించి లేచే ముందు, క్షమార్పణగా చూస్తూ అన్నాడు.

''సారీ! ఎక్కువగా మాట్లాడేసి నట్టున్నాను. నా యీ ఆవేశం మీ మీద కాదు! ఇంట్లోవున్న నా చెల్లెళ్లతో కూడా నాకిదే సమస్య ఎదురయింది. వీళ్లకి నచ్చినవాళ్లు, వీళ్లని మెచ్చటంలేదు. వీళ్లు నచ్చినట్టుగా చెప్పినవాళ్లకి వాళ్లు సవాలక్ష వంకలు చూపిస్తున్నారు. పోనీ పెళ్లి కాకపోతే పోయిందిలే అనే గట్టి మనసు వుందా! అందరిలా మేము లేమే అనుకుంటూ మనసులో బెంగ. అదంతా ప్రతి చిన్న విషయానికి చిరాకుగా బయటపడుతూ, నా ప్రాణాలు తోడు తున్నారు!" అతను జుట్టులోకి వేళ్లు పోనిచ్చుకుని పైకి తోసుకున్నాడు.

చివరి మాటలు వినగానే, వకుళ లోలోపలే వులిక్కిపడింది! అది అతని చెల్లెళ్ల సమస్యేనా? కాదు! తనదికూడా. తనలాంటి మూర్ఖులు అమాయకులు యింకా కొన్ని వందలమంది వుండచ్చు !

ఇద్దరూ బయటికి వచ్చారు.

అతను స్కూటరువైపు చూపిస్తూ, "నాతో వస్తే మీ హాస్టల్ దగ్గర దింపు తాను! లేదంటే అదుగో, బస్సు వస్తోంది. త్వరగా వెళ్లండి,'' అన్నాడు.

వకుళ బస్సువైపు వెళ్లలేదు.

ఒకప్పుడు, ప్రతి చిన్నదానికీ ఎవరు ఏమనుకుంటారోనని జంకేది, భయపడేది. ఆ మనస్తత్వంతోనే, 8 సంవత్సరాలు వంటరిగావున్నా, ఎవరితో ఎలాంటి పరిచయాలూ హద్దుమీరి ఏర్పడలేదు! కానీ యీ మధ్యనే వకుళ మనస్తత్వం మారిపోతోంది! ఎవరినీ లక్ష్యపెట్టాలని అనిపించటంలేదు.

అందుకే మరొకసారి అడిగించు కోకుండా, శ్రీనివాసమూర్తి వెనక కూర్చుంది !

స్కూటర్ రంయ్‌న వెళుతోంది! వకుళ ప్రాణం హాయిగావుంది ! శ్రీనివాసమూర్తి భుజంమీద చెయి ఆనించటంలో గొప్ప సంతోషం కలుగు తోంది !

అతను హాస్టల్ దగ్గర దింపి వెళ్లి పోయాడు ! వెళుతూ, ''ఆదివారం శలవేగా, వీలుంటే వస్తాను,'' అన్నాడు.

''తప్పకుండా, నాక్కూడా వేరే పనేంలేదు,'' అంది పుత్సాహం సాధ్యమైనంత అణచుకుంటూ. వకుళ లోపలికి వచ్చింది. శ్రీనివాసమూర్తి ఇదివరకు కంటే శారీరకంగా పాడయాడు. సమస్యలు మోస్తున్న భారం స్పష్టంగా అతనిలో కనిపిస్తోంది.

అతను చాలా మామూలు మనిషిలా కినిపిస్తాడు. అతనిలో ఒకరకమైన వ్యక్తిత్వం వున్నట్టు బహుశా అతనికి కూడా తెలియదేమో! తల్లి పోయింది. యింట్లో రోగిష్టి తమ్ముడు! పెళ్లికాని చెల్లెళ్లు! హిస్టీరియా భార్య.పిల్లలు. మరో పక్క ప్రమోషన్లతోపాటు బాధ్యత మరీ మరీ పెరిగే వుద్యోగపు వత్తిడి! వకుళకి శ్రీనివాసమూర్తి, అసలు సిసలైన హీరోగా అన్పించాడు. అతనంటే గౌరవభావం ఏర్పడింది. 8 సంవత్సరాల క్రితం అతిసామాన్యంగా కన్పించిన యితన్ని చులకనగా భావించిన తన చిన్నమనసుకి తనే సిగ్గుపడింది.

మళ్లీ ఆదివారం వచ్చింది.

వకుళ చాలారోజుల తర్వాత ఆతురతగా ముస్తాబుఅయింది. ఆనందంగా ఎదురుచూసింది. వకుళకి యిప్పుడు అతని రూపురేఖలు గుర్తుకు రావటంలేదు. చనువుగా, ఆత్మీయంగా మాట్లాడే అతని ధోరణే జ్ఞాపకం వస్తోంది. మధ్యాహ్నం గడిచింది. సాయంత్రం అయింది. రాత్రి పొద్దుపోయింది. ఈ ఆశాభంగం వకుళ భరించలేకపోయింది. మనసు చిన్నపిల్లలా అయిపోయింది. తన అలంకరణకి తనే సిగ్గుపడింది. స్వాభిమానం ముంచుకురాగా ఏడుపు వచ్చేసింది.

తర్వాత ఆదివారం ఎదురుచూడలేదు. బట్టలు వుతుక్కుంటూ, జడ వేసుకోవటానికి కూడా బద్ధకంవేసి వేలిముడి పెట్టుకుని కూర్చుంది. కానీ అతను వచ్చాడు. వకుళ ఖంగారుపడిపోయింది. యీ వేలుముడితో యీ నేతచీరెతో, అతనికంటే తనే పెద్దవయసుగా కన్పిస్తోంది. కానీ అతనిదేమీ పట్టించుకున్నట్టులేదు.

''సారీ! క్రిందటి ఆదివారం అర్జెంట్ పని తగిలి రాలేకపోయాను. అదే మీకు చెప్పివెళదామని వచ్చాను."

''కూర్చోండి, యిప్పుడే వస్తాను." వకుళ లోపలికి పరుగెత్తి ఆదరాబాదరా జుట్టువిప్పి వదులుగా రిబ్బన్ కట్టుకుని, పౌడరు వేసుకుని వచ్చింది. వకుళ వచ్చేసరికి అతడు పేపరు తిరగేస్తున్నాడు. స్టూలు లాక్కుని కూర్చుంటూ, ''ఇప్పుడు చెప్పండి, ఏమిటా అర్జెంట్ పని?" అంది.

''పెళ్లి చూపులు వుండేను వెళ్లాల్సి వచ్చింది." అతను పేపరు మడుస్తూ అన్నాడు.

"పెళ్లిచూపులా ? మీ చెల్లెలికా?"

''కాదు, నాకే !"

వకుళ ఆకాశం మీదనుండి క్రింద పడినట్టుగా చూసింది.

"మీరు...మీరు – మళ్లీ పెళ్లిచేసుకుంటున్నారా ?"

''చేసుకోకపోతే జరగదు. పిల్లలు చిన్నవాళ్లు. నా వయసు కూడా మరీ పెద్దదేంకాదు. అడ్డదార్లంటే నా కసహ్యం!" ఎంతో మామూలుగా చెప్పాడతను.

"మరి పిల్ల నచ్చిందా ?"

"పిల్లకేం ? పిల్ల బాగానే వుంది. కానీ పెట్టిన షరతులే నాకు నచ్చలేదు."

"ఏమడిగింది ?"

"నేను చేయలేనివి చాలా అడిగింది. నా చెల్లెళ్లని, తమ్ముడిని ఏ హాస్టల్లోనైనా చేర్పించేయాలిట ! నా పిల్లల్ని, నా భార్య పుట్టింటికి పంపేయాలిట." వకుళ వింటోంది.

"ఆ అమ్మాయి షరతులకి నేనేం బాధపడలేదు. ఆ అమ్మాయి నా జీతం చూసి రెండో పెళ్లి అయినా నన్ను చేసుకోవటానికి యిష్టపడింది. అలా అడగటం న్యాయమే ! అయినా, యీ రోజుల్లో భార్యలు చాలా ఖరీదయిపోతున్నారు. దానికి తగినట్టుగా మా మగవాళ్ల జీవితాలు ఎదగటంలేదు. రేపు యింకో సంబంధం చూస్తున్నాను. ఆ అమ్మాయి మీకు తెలుసు. మీ ఆఫీసులో పనిచేసే సోమసుందరం చెల్లెలు. కాస్త నల్లగా వుంటుందిట ! వుంటే నాకేం ? పిల్ల బుద్ధిమంతురాలేనట. చూడాలి."

"అతను మళ్ళీ జుట్టులోకి చేయిపోనిచ్చుకున్నాడు. కాస్త శాంత స్వభావురాలు కావాలి నాకు. రాగానే నా యిల్లు నరకం చేయకూడదు." అతను కాసేపు కూర్చుని, వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా వకుళ ఆలోచిస్తూనే వుంది ! తనకి పెళ్ళే కాలేదు ! అప్పుడే అతనికి రెండు పెళ్ళిళ్ళు ! పెద్దగా ఆశలూ, కలలూ లేని అతనెంత అదృష్టవంతుడు. వున్నంతలో అతను సుఖంగా, ఆనందంగానే గడుపుతున్నాడు. అతనికి జీవితం గురించి భయంలేదు. కష్టపడుతున్నాడు. అందులో సంతృప్తి చూసుకుంటున్నాడు. అందినంతవరకూ ఆనందం పొందుతున్నాడు. అతనికి కొన్ని సమస్యలున్నాయి, నిజమే ! కానీ ఆ మాత్రం సమస్యలు లేకుండా ఎవరుంటారు ? చిన్నవాళ్లకి చిన్నబాధలు, పెద్దవాళ్లకి పెద్ద బాధలు ! అంతే తేడా ! వకుళకి ఆలోచిస్తున్నకొద్దీ, ఆడవాళ్లకంటే, మగవాళ్లే ఎక్కువగా సుఖపడుతున్నట్టుగా అనిపిస్తోంది. దేన్నీ మనసుకి పట్టించుకోరు ! హృదయాల్ని బ్రద్దలవ్వనీయరు ! కాస్తో, కూస్తో అలా చేస్తే, ఆ మగవాడి మన

స్త్రీత్వంలో ఆడతనం వున్నదన్నమాటే! వకుళ మర్నాడు వుదయం అంతాకూడా యిదే ఆలోచించింది. మధ్యాహ్నం పోస్ట్‌లో చివరికి శ్రీనివాసమూర్తి పేరిట ఒక ఉత్తరం వ్రాసిపడేసింది. ఉత్తరం చాలా సూటిగా, నిర్మొహమాటంగా వుంది.

"మీకు అభ్యంతరం లేకపోతే, మీ పిల్లలకి నేను తల్లిని అవుతాను. మిమ్మల్ని పెళ్ళిచేసుకోవటానికి నేనేమీ షరతులు పెట్టను. ఈ విషయంలో మీ అభిప్రాయం ఎలా తెలియచేస్తారో మీ యిష్టం—వకుళ."

మర్నాటి సాయంత్రం, వాసమూర్తి స్కూటర్ వకుళ హాస్టల్ ఆవరణలో రంయ్‌న వచ్చి ఆగింది.

వకుళ జ్వరంపడి లేచిన మనిషిలా నీరసంగా కుర్చీలో కూర్చుని వుంది. అతను వస్తూనే అన్నాడు.

"మీ ఉత్తరం చూసి నాకు మతి పోయింది. ఇదేమిటి, ఇలా వ్రాసారు ?"

"వ్రాయకూడనిదేదయినా వ్రాసానా ?"

అబ్బెబ్బె. అదేంకాదు. కాని మీరు—మీకు నేనేం యివ్వగలను ? నా చెల్లెళ్ళు పెళ్ళికి ఎదిగి వున్నారు. నా రోగిష్టి తమ్ముడు నాకే అంకితం. నా పిల్లల్లో పెద్దవాడు పిచ్చివాడు. నా చెల్లెళ్లని ఎలాగో అలా పెళ్ళిచేసి పంపినా, అప్పటికి నా పిల్లలు ఎదుగుతారు. నాకు ప్రమోషన్లమీద ప్రమోషన్లు వచ్చినా, నా జీవితంలో మాత్రం ఎదుగూ, బొదుగూ వుండదు."

"అది నాకు తెలుసు !" నిర్వికారంగా అంది.

"మీకు – మీకు యింకోటి కూడా చెప్పాలి నేను. నేను ఆపరేషన్ చేయించుకున్నాను." ఎర్రబడిన ముఖంతో అన్నాడు. వకుళ ముఖం క్షణంసేపు మ్లానమైంది. అయినా అది ఎంతసేపో నిలవలేదు.

"మీకు భార్యని అయినప్పుడు, మీ పిల్లలు, నా పిల్లలు కారా ?"

"థాంక్ యూ ! థాంక్ యూ ! కానీ మిమ్మల్ని నేనేం సుఖపెట్టగలనా అని..."

"సుఖానికి నిర్వచనం డబ్బు, అందానికి నిర్వచనం అవయవ సౌష్టం అనుకునే వయసు దాటిపోయినదాన్ని నేను!ఆ విషయం మీరు ఆలోచించకండి. మీరు యివ్వలేనిది ఏదీ నేను అడగను ! నేను ఉద్యోగం మానను, నా జీతం మీకు యిస్తాను. ప్రతిఫలంగా. మీ తోడు నాకు యివ్వండి."

"వకుళా !"

"స్వీట్ నథింగ్స్ చెప్పుకునే వయసు కాదు మనది ! అసలు పెళ్ళి విలువ యుక్తవయసులో వేడి రక్తం వాళ్లకంటే, ఆ రక్తం చల్లబడి, అసలు జీవితం అంటే ఏమిటో తెలిసిన నాలాటి వాళ్లకే తెలుస్తుంది ! మీ మగవాళ్ళ సంగతేమో నాకు తెలియదు. కానీ ఆడ వాళ్లకి బంధాలు, బాంధవ్యాలు చాలా కావాలి. యీ అల్లిక ఆమె చుట్టూ లేకపోతే, జీవితం శ్మశానంలా వుంటుంది."

అతను విశ్రాంతిచెందిన వాడిలా వింటున్నాడు. అతన్ని చూసి వకుళ నవ్వింది. అతనిప్పుడు అచ్చు, 8 సంవత్సరాలక్రితం తనని పెళ్ళి చేసుకోమని అడిగిన శ్రీనివాసమూర్తిలా వున్నాడు.

"మీరే చెప్పారుగా. పెళ్ళికి కావాల్సింది అర్థంచేసుకునే మంచి మనసు, కష్టసుఖాలు పంచుకునే ఆత్మీయత ముఖ్యం అని."

"వాటికేం ? అవి మీకు ఎంతయినా పంచగలను."

"అవి నాకు చాలు. ఆనాడు మీరు నన్ను పెళ్ళిచేసుకోమని అడిగితే ఆ సూటితనం, మొరటుతనంగా భావించాను. నా అమాయకత్వాన్ని మీరు మన్నించండి."

ఆ వారంలోనే యిద్దరూ రిజిష్టర్ మేరేజ్ చేసుకున్నారు. శ్రీనివాసమూర్తి గ్రాండ్‌గా పార్టీ యిస్తానన్నాడు. వకుళ ఒప్పుకోలేదు. అందరి ముందూ కొత్త పెళ్ళికూతురిలా సిగ్గుపడటం నాకు రాదు. అది నా వయసూ కాదు అంటూ తిరస్కరించింది.

శ్రీనివాసమూర్తి వకుళని పెళ్ళిచేసుకుని యింటికి తీసుకురాగానే, చెల్లెళ్ళు మూతులు బిగించారు. వకుళని ముళ్ల లాటి చూపులతో ఎగా దిగా చూసారు. పిల్లలు మాత్రం అమాయకంగా, "నాన్నా ! ఈవిడెవరు?" అని అడిగారు. "మీ అమ్మ" అని చెబుతుంటే, వకుళకి కళ్లు చెమ్మగిల్లినాయి. ఆ పిచ్చి పిల్లాడ్ని గాని, బట్టలు మాసి, అశ్రద్ధగా పెరుగుతున్నట్టున్న ఆ మిగతా పిల్లల్ని చూసి గాని, ఏవగింపు కలగలేదు. పైనుంచి వీళ్లు నా వాళ్ళు అనే భావన కలిగింది.

ఆ రాత్రి, తన దగ్గరకి వచ్చిన వకుళని చూస్తూ శ్రీనివాసమూర్తి గద్గద కంఠంతో, "వకుళా ! ఆనాడే నువ్వు మన పెళ్ళికి ఒప్పుకునివుంటే నాకు ఆ హిస్టీరియా మనిషితో, ఆ నరకమూ తప్పేది. మన పిల్లలు మనకి వుండే వాళ్ళు", అన్నాడు.

"అవును. నా జీవితంలో ప్రతిదీ లేటే ! నా కాలం వ్యర్థం అయిం తర్వాత గాని, నన్ను గమ్యం చేర్చే బస్సు నాకు దొరకదు. నేను అప్పుడే మిమ్మల్ని పెళ్ళిచేసుకుని వుంటే, నా కలలు తీరలేదనే అసంతృప్తితో మీ జీవిత పర్యంతం నరకంచేసి పెట్టే దాన్నేమో ! నాకిదే బాగుంది" అంది వకుళ నిట్టూరుస్తూ.